# ఓటరుగా నమోదు చేసుకోవాలి



కొడంగల్: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

బొంరాస్‌పేట, డిసెంబర్ 13 : వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చని ఈ విషయాన్ని బీఎల్‌వోలు ప్రచారం చేసి దరఖాస్తులు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది నిర్వహించే లోకసభ ఎన్నికల కోసం 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించడానికి ఎన్నికల సంఘం నిర్ణయించినందున అర్హుల నుంచి ఫాం–6లో దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. అదేవిధంగా చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, తప్పుగా నమోదైన పేర్లను సరి చేసుకోవడం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి షిఫ్ట్ చేయడానికి అవకాశం ఉందని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ రవిచారి,బీఎల్‌వోలు పాల్గొన్నారు.

**కొడంగల్:** వచ్చే గ్రామ పంచాయతీ, పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా బుధవారం తహసీల్దార్ విజయ్‌కుమార్ మండల పరిధిలోని బీఎల్‌వోల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించే విధంగా బీఎల్‌వోలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. ఓటరు నమోదులో భాగంగా బీఎల్‌వోలు నిర్వహించాల్సిన విధుల పట్ల ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శృతితో పాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

**తాండూరు రూరల్:** రాబోయే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువతీ, యువకుల పేర్లు ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. జనవరి 1,2024 నాటికి 18 ఏండ్లు నిండిన వారి పేర్లు నమోదు చేయించాలన్నారు. అదేవిధంగా చనిపోయిన, డబుల్ ఓటర్లుగా నమోదైన వారి పేర్లను తొలగించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో రతన్‌సింగ్, బీఎల్‌వోలు ఉన్నారు.

# నిరుత్సాహ పడొద్దు

**సమన్వయ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**



అల్లీపూర్ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

ధారూరు, డిసెంబర్ 13: మండల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా నిరుత్సాహపడకూడని, ప్రజా తీర్పును గౌరవిస్తూ...మీ అందరికీ అండగా ఉంటానని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎబ్బనూరు, అల్లీపూర్ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎబ్బనూరు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజానాయక్, మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కావలి అంజయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు రాములు, అంజయ్య, గోపాల్, చిన్నయ్యగౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ



కులకచర్ల, డిసెంబర్ 13 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మానవ మనుగడకు సమాజ అభ్యున్నతికి అవసరమైన హక్కులను కల్పించారని జడ్పీటీసీ రాందాస్‌నాయక్ అన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం విగ్రహప్రతిష్ఠాపనకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ సత్తినేని సుధాకర్‌రెడ్డి, తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, చౌడాపూర్ మండల అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు అశోక్, గ్రామస్తులు గురుదేవరెడ్డి, మల్లేశ్, తిరుపతయ్య, లక్ష్మణ్, గోవర్ధన్, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

## చెరువులో నుంచి దారి తొలగింపు



తాండూరు రూరల్, డిసెంబర్ 13: ఈ నెల 11వ తేదీన 'చెరువులో నుంచి దారి' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తాండూరు మండలం, గౌతాపూర్ మల్లన్న కుంట (చెరువు) లో నుంచి ఓ వ్యక్తి ప్లాట్‌లోకి దారి వేశాడు. నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ చెరువులోని దారిని జేసీబీ సహాయంతో తొలగించారు

## మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, డిసెంబర్ 13 : పరిగి పట్టణంలోని 12వ వార్డు పరిధిలో ప్రధాన రహదారిపై గల మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో బుధవారం మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ మరమ్మతు చేయించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో రెండు రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో జేసీబీ సహాయంతో మరమ్మతు పనులు చేయించారు. నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేశ్, మునీర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ ప్రకారం బోధించాలి



చౌదర్‌పల్లి సీఆర్‌సీ సమావేశంలో టీఎల్ఎం ఉపయోగించి మాడల్ లెస్సన్ బోధిస్తున్న టీచర్

బొంరాస్‌పేట, డిసెంబర్ 13 : ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ ప్రకారం పాఠాలను బోధించాలని బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు హరిలాల్, శ్రీహరిరెడ్డి అన్నారు. బుధవారం చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన వారు ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు అమలుపై ఉపాధ్యాయులకు వారు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఓరల్ రీడింగ్‌పై బాగా శ్రద్ధ చూపాలని సూచించారు. టీచర్ డైరీలో లెస్సన్ ప్లాన్ రాసుకోవాలని సూచించారు. పాఠాలు బోధించే సమయంలో టీఎల్ఎం వాడాలన్నారు. మండలంలోని పలు సీఆర్‌సీలలో బుధవారం రెండవ రోజు కూడా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. క్లస్టర్ల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవాబుపేట, డిసెంబర్13: మండలంలోని పులుమామిడి గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యాకలాపాలు చేస్తే 100 లేదా 1098 డయల్ చేస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకో నున్నట్లు తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగానే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అలిమొదిన్, రవీందర్, పాఠశాల సిబ్బంది బాల రాజేశ్వరి, హన్మంత్‌రెడ్డి, వనిత, అమ్జద్, ప్రభుచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమర జవాన్లను స్మరిస్తూ ర్యాలీ



పరిగి, డిసెంబర్ 13: 2001 డిసెంబర్ 13న పార్లమెంటుపై ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటిస్తూ బుధవారం పరిగిలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కొడంగల్ క్రాస్‌రోడ్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ జరిగింది. అనంతరం అమరులైన వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, బీజేపీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, వెన్న ఈశ్వరప్ప, అసెంబ్లీ కన్వీనర్ నర్సింహ, జిల్లా కార్యదర్శి పెంటయ్య, రాముయాదవ్, బాలకృష్ణారెడ్డి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు గురునాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లింగమయ్య, ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కొబ్బరికాయలు అమ్మకం, పార్కింగ్‌కు 19న వేలం పాట

వికారాబాద్, డిసెంబర్ 13 : అనంతపద్మనాభస్వామి దేవాలయం వద్ద ఈ నెల 19వ తేదీన కొబ్బరి కాయలు అమ్ముకునేందుకు, వాహనాల పార్కింగ్ కోసం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం అనగా 01.01.2024 నుండి 31.12.2024 వరకు (కార్తీక మాసం మినహాయించి) కొబ్బరికాయలు అమ్ముకోవడం, పార్కింగ్ ఫీజు వసూలు హక్కు కల్పించనున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట జరుగుతుందని ఆసక్తి గల వారు రూ.లక్ష డిపాజిట్ చేసి పాల్గొనాలన్నారు. హక్కు పొందని వారికి డిపాజిట్ వాపసు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

## రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దేముల్, డిసెంబర్ 13 : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇటీవల నూతనంగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు వెంటనే రైతుబంధు పంట పెట్టుబడి ఆర్థిక సాయం కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ నజీరోద్దీన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు నూతనంగా పట్టా పాసుపుస్తకాలను పొంది రైతుబంధు పంట పెట్టుబడి ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోని రైతులు మండల పరిధిలోని ఆయా గ్రామాల వ్యవసాయ క్లస్టర్లలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను(ఏఈఓలు) సంప్రదించి పట్టాదారు పాసుబుక్ జిరాక్స్,బ్యాంకు ఖాతా జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్,మొబైల్ నెంబర్‌లను సమర్పించి రైతు బంధు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని వినతి

వికారాబాద్, డిసెంబర్ 13 : పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఈ విషయంపై బుధవారం వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, ఎంఐఎం పార్టీ నాయకులు షరీఫ్ పాల్గొన్నారు.